

# కథా కౌముది

## పువ్వాకు ఎంగిలి    చిట్టత్తూరు మునిగోపాల్



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
సాధారణ ప్రచురణ కథ

పకపకా నవ్వింది ఆయమ్మ. బుగ్గన పెట్టుకోనుండే పువ్వాకును వగసారి వక్కాకుతో కలేసి వడేసి నమిలింది. కొంచెం సారాన్ని మింగింది. చూపుడు వేలు, మజ్జేలు కొంచెం ఎడంగా జేసి పెదాల మీద పెట్టుకొని మిగిలిన రసాన్ని తుపక్కన ఉమ్మేసింది.

"ఏందట్టా బయపడతా ఉండావు సారూ, నేను ఊరికినే ఎవురిమిందా ఉయ్యను. నా బతుక్కు అడ్డామొస్తే గమ్మునుండను." మళ్ళీ పకపకా నవ్వేసి అనింది.

నామీద ఆ పువ్వాకు ఎంగిలి ఎక్కడ పడి బట్టలు పాడవతాయేమోనని గబుక్కున పక్కకు జరిగిన సర్దుకుని నిలబడ్డాను.

ఆమె ఊంచిన ఎంగిలి, ఎవురిని నిలదీయడానికోగానీ మురుగు కాలవలో కొట్టుకొని పోతావుండాది ఊరుదిక్కు.

"అదిగాదకా.. అక్కడ పెద్దపెద్ద ఆపీసర్లు జుట్లు పీక్కుంటా వుండారు. నువ్వేమో ఈడ ఇలాసంగా కూకోని పువ్వాకు, వక్కాకు కలేసి వడేస్తా ఉండావు.." అన్నాను.

"చూడు సారూ.. నువ్వెందుకొచ్చినట్టు నా దెగ్గిరికి ?" తలెగరేసి అడిగింది.

"ఏమీ లేదకా.. నీ కస్టం ఏందో కనుక్కొని ఎల్దామని.." చెప్పినాను.

"అంటే ఉండే బూమి, ఇల్లు పోతావుంటే ఏమీ జెయ్యలేక కన్నీళ్ళు ఇడస్తా ఉంటానని వొచ్చినావా?"

"అదిగాదకా.. నీకు జరిగిన అన్యాయం రాసి పేపర్లో ఏస్తే కలెక్టర్ జూసి, నీకు న్యాయం జేస్తాడు గదా."

"నేను జెప్పినానా నీతో, నాకు కష్టం వొచ్చి పడిండాదని?"

ఈయమ్మతో పెద్ద చిక్కొచ్చి పడిందే. పేపర్ కు ఒక గట్టి న్యూస్ రాసి శానా కాలమైంది. హ్యూమన్ ఇంటరస్ట్ అంటారే, అట్టాంటి కతలు రాయడంలో నేను పెద్ద మొనగాడని అనుకుంటారు ఆపీసులో. కానీ యాడ.. ఒక్క కష్టపడే మనిషి గూడా దొరకడం ల్యా. వాళ్ళు దొరకడం లేదనేకంటే, నేను ఫీల్డ్ మీద ఎల్లడం లేదని అనొచ్చు. నిన్న తెల్లారి పొద్దుబోక ఆ సీఐ సారు దెగ్గిర ఎల్లి కూకుని పిచ్చాపాటీ మాట్లాడతా వుంటే, సబ్ రిజిస్ట్రార్ వొచ్చినాడు. నేను ఎల్లేతాళికే సీఐ ఛాంబర్లో ఎవరో పెద్ద మనిషి, సన్నగా రివటలా ఉండే జీవి ఒగాయన నిలబడి డీప్ డిస్కషన్లో ఉండాడు. రిజిస్ట్రార్ వచ్చినాక ఆ ముగ్గురి మాటల్లో తెలిసింది, ఆ సన్నటి రివట మనిషి సబ్ రిజిస్ట్రార్ ఆపీసులోనే జూనియర్ అసిస్టెంట్ అని.

"ఆయమ్మ మీద కంప్లయింట్ ఇవ్వాల్సిన అవసరం ఏమొచ్చింది?" అంటాడు సీఐ.

"నన్ను మోసం చేసింది సార్. డీఆర్ (డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్) ఆర్డర్ వేశాడు కేసు వెయ్యమని." అంటాడు సబ్ రిజిస్ట్రార్.

"తనకు గూడా సగం వాటా ఉండే ఇల్లు, అక్కతెగనమ్మేసిందని కోర్టులో కేసు ఏసి ఉండాడు, ఇది ఆనా కొడుకు కేసే గదా? వారం రోజులనాడు కలెక్టరేట్ లో మీద డీజిలు పోసుకొని సూయిసైడ్ అటెంప్ట్ చేసినాడు లండీ కొడుకు. నన్ను గూడా మా ఎస్పీ ఎక్కి దిగతా వుండాడు. వోడిని ఎప్పుడో నేనే పెట్రోలు పోసి తగలబెట్టేస్తా." బల్లమీద గెట్టిగా గుద్దినాడు సీఐ.

"అందుకే సార్. నాకు ఈ తంటొచ్చి పడింది." తల కొట్టుకున్నాడు సబ్ రిజిస్ట్రార్.

"ఏంది సార్ కతా?" అనడిగినా. నా పని అదేగా, ఊళ్ళో సంగతులన్నీ ఆరా తీసి పేపర్ న్యూస్ చేయడం.

"ఈ కేసు పెద్ద న్యూసెన్స్ అయిపొయ్యిందబ్బా.." అన్నాడు సీఐ.

"అంతా ఆయమ్మవల్లే. దానివల్లనే నాకీ చావు వొచ్చిపడింది." కసిగా గొణిగినాడు సబ్ రిజిస్ట్రార్.

"తమ్ముడి ఇంటి వాటాను గూడా అది తెగనమ్మేసింది సార్." చెప్పాడు సీనియర్ అసిస్టెంట్.

"రిజిస్ట్రీ జేసింది మీ సబ్ రిజిస్ట్రారే గదా?" సీఐ అన్న ఆమాటతో కతక్కన నోరు మూసేసినాడు ఆ జూనియర్. ఉద్యోగంలో జూనియరే గానీ ఒగిసులో, ఇటుమంటి లిటిగేసను యవ్వారాల్లో శానా పెద్ద మనిసనేనని తెలిసిపోతా ఉండాది ఆయిన మాటల్లో.

"ఇంతకీ ఏమి జరిగింది సార్?" ఉత్సుకత ఆపుకోలేక పోతున్నాను నేను.

"ఏముండాది, అక్కాతమ్ముళ్ల ఆస్తి పంచాయితీ. ఈడు ఎల్లి అక్కమీద కేసు ఏసినాడు. ఇప్పుడు లాక్కోలేక పీక్కో లేక అల్లాడతా ఉండాడు ఈ సబ్ రిజిస్ట్రార్. దాని మీద తమ్ముడు పెట్టిన కేసు రిజిస్టర్ అయింది." తన ముందున్న ఫైల్ ను ఒకసారి పైకి ఎత్తి పడేస్తూ చెప్పినాడు సీఐ.

నాకు నమ్మకం కుదరలా. ఒక ఆడది, చూస్తా చూస్తా తమ్ముడికి ద్రోహం చేస్తాదా? ఆ తమ్ముడే ఏందో తిరకాసు చేసి ఉండాల. దీని ఎనక ఇంకేదో పెద్ద కతే ఉండాల, అని డిసైడయ్యా.

"సరే సార్, మీపాట్లు మీరు పడండి, నేను వెళ్లొస్తా.." చెప్పి సీఐ ఛాంబర్ నుంచి మెల్లగా బయటకు వచ్చేశాను.

"బాగుండారా సార్. ఈ మజ్జ ఈపక్క కనిపించడం లేదు." ఎదురుగా క్యాబిన్ లోనుంచి రైటర్ పలకరించినాడు.

నాకుగూడా ఆయనతోనే పని ఉండాది. అందుకని పలకరిస్తానే ఆయన దెగ్గిరికి వెళ్ళి కూర్చున్నాను.

"సార్, లోపల సబ్ రిజిస్ట్రార్ ఉండాడు, ఏంది కత? ఎవురా ఆడ మనిషి?" అని అడిగినాను.

"అది పెద్ద కంత్రీ ముండ లే సార్." ఈయన మాటల్లో కూడా కసి కనబడతా ఉండాది.

ఈ పోలీసోళ్ళు, ఆ సబ్ రిజిస్ట్రార్ ఆపీసోళ్ళు అందురూ కలుసుకోని ఆయమ్మ ఎవురోగానీ, అన్యాయం జేసేస్తా ఉండారే.. అనిపించింది నాకు, ఆ రైటరు కసి జూస్తానే. కొంచెంసేపు బాతాఖానీ వేసినాక, ఆయమ్మ అడ్రెస్ తీసుకొని బయటకు వొచ్చినాను.

ఈయమ్మ కత ఎనకమాల ఉండే హ్యూమన్ యాంగిల్ జుట్టు పట్టుకొని ఇవతలికి ఈడ్చాల. మాంచి హ్యూమన్ ఇంటరెస్ట్ స్టోరీ రాసేసి, మళ్ళీ ఫామ్ లోకి వొచ్చేయాల. డెస్కుతో శెభాష్ అనిపించుకోవాల.

ఇదిగో ఇదే ఆలోచనతో ఈరోజు ఈడకు వొచ్చినాను. ఈమజ్జనే మున్సిపాలిటీలోకి చేరిన ఒక నూరా నూటయాపై గడపలుండే చిన్న ఊరది. ఊరు చివర ఒక రెండు సెంట్ల ప్లేసులో రెండు గదుల రేకుల షెడ్డు ఉండాది. దాని ముందు చిన్న ఖాళీ స్థలం కూడా మిగిలి ఉండాది. అదిగో.. ఆ ఇంటిని వెదుక్కుంటూ వెళ్ళేసరికి తెల్లారి పదకొండు గంటలయింది. ఒగకాలు పైకి మడుసుకొని, రెండోకాలు నేలమీద ఏలాడేసుకొని చిన్న తిన్ని మింద కూకోనినుండాది ఆయమ్మ. తీరిగ్గా తమలపాకు ఈనెలు తీస్తా మాటిమాటికీ తుపక్కన ఎంగిలి ఊంచతా ఉండాది.

అదిగో.. ఆయమ్మ దెగ్గిరే నేనిప్పుడు నిలుసుకొని ఉండా. అయితే 'కష్టం వొచ్చిందని నేను జెప్పినానా నీకు?' అని ఆ ఆడది నిలదీసేతాళికి నా ప్రాణం ఉసూరుమనింది. ఈయమ్మ కన్నీళ్ళు పెట్టుకుంటా తనకు తమ్ముడు జేసిన అన్యాయం గురించి చెప్తాదని వొచ్చినా. కేసులతో భయపెట్టే పోలీసు పైశాచికత్వం గురించి శాపనార్థాలు పెడుతూ వివరిస్తాదని, తన కష్టాల గురించి పేపర్లో రాయడానికి వొచ్చిన నన్ను దేవుడిలా చూసి, ఎలాగైనా కష్టాలనుంచి

గట్టెక్కించమని కాళ్లావేళ్ళా పడతాదని గూడా అనుకున్నా. ఇంత ఆశితో ఒచ్చిననాకు, ఆయమ్మ తీరుతో ఆకాశంమీద నుంచి దడక్కన కిందపడినట్లే అయిపోయింది.

"ఏంది సారూ, అట్టా ఏలాడపడి పొయ్యినారు. ఇదిగో, ఇట్టా వొచ్చి కూకోండి." కొంచెం పక్కకు జరిగి అరుగు మింద చోటు ఇచ్చింది. కారుతున్న చెమట్లను ప్యాంటు జోబులోనుంచి తీసిన కర్చీఫ్ తో తుడుచుకుంటూ ఆమె చూపించిన కొంచెం చోటులో కాళ్ళు వేలాడేసి కుదురుకుని కూకున్నాను.

"ఉండు సారూ, ఇప్పుడే వస్తాను." చెప్పి, ఆ రేకుల ఇంట్లో దూరింది. రొండు నిమిషాల్లో పెద్ద స్టీలు గ్లాసు నిండా చిక్కటి మజ్జిగతో వొచ్చి చేతికిచ్చింది. "తాగండి సారూ, పాపం నాకోసరం ఎంతో దూరం నుంచీ వొచ్చినట్లుండారు.." చెప్పింది.

అప్పటికే ఎర్రటి ఎండకు విపరీతమైన దాహంగా ఉండాది. మొహమాటం లేకుండా గ్లాసు తీసుకొని, దానిలోని మజ్జిగను పైకెత్తి గటగటా తాగేసినాను. గ్లాసు తీసుకొని పక్కన పెట్టింది ఆయమ్మ.

"నువ్వుజెప్పు సారూ, ఇదేమైనా న్యాయంగా ఉందాదా  నీకు?" నిలదీసినట్లు అనింది ఆయమ్మ, మళ్ళీ వొచ్చి నా పక్కనే కూకుంటా. నేనేం జేసినానో అర్తంగాక అయోమయంగా జూసినా.

"ఇదిగో ఇట్టా నిలదీయలేకపొయ్యినా ఆరోజున ఆ పెద్ద మనుసులను." మళ్ళీ తనే అనింది.

ఓహో, ఉపోద్ఘాతం అన్నమాట. చెప్పబోయే విషయాన్ని, వినే మనిషినే టార్గెట్ చేసినట్లు చెప్పడం ఇప్పటికీ చాలా మందికి ఉన్న అలవాటే.

"ఏం జరిగిందకా? నీ తమ్ముడు నీకు అన్యాయం జేసినాడా?" అడిగినాను, ఆమె దిక్కు తిరిగి. పెన్నూ, నోటు బుక్కు బయటకు తీయాలని మానుకున్నాను. ఇటువంటి తల్లులు పాయింట్లు నోట్ చేయడం మొదలు పెట్టగానే బిగదీసుకు పోతారు. వాళ్ళ నోట్లోనుంచి ఒక్క మాట కూడా రాదు. మన మనిషి అనుకుని చెప్పాలనుకున్న విషయం ఏదైనా, పెన్ను పేపర్ మింద పెడతానే ఆగిపోతాది. ఎదురుగా ఉన్నోడు పరాయిగా అనిపిస్తాడు. అందుకే ఆ పని మానేసి పాయింట్లు మెదడులోనే నోట్ చేసుకోవడం మొదలుపెట్టాను.

"అదిగాదు సారూ, ఆ ఎమ్మార్వో, ఆ వీఆర్వోల నాబట్టలు నా కడుపుమంట బెట్టుకున్నారే. వాళ్ళు బాగుపడతారా? వాండ్ల పెళ్ళాలు ముండమొయ్యా, వాళ్ళ కాళ్ళూచేతులూ పడిపోనూ.." ఏకబిగిన శాపనార్థాలకు తగులుకునింది.

మధ్యలో ఈ ఎమ్మార్వో, వీఆర్వోలు ఎందుకు వచ్చినారో అర్థం గాలా నాకు. అదే అడిగినాను, "అదిగాదకా,  అక్కడ స్టేషన్లో కేసు ఏసింది నీ తమ్ముడు. నీమీద కేసు పెట్టమని సీఐకి కంప్లయింట్ ఇస్తావుండేది సబ్ రిజిస్ట్రార్. మజ్జలో ఎమ్మార్వో ఎందుకు వొచ్చినట్టు?"

“బో.. అది పెద్ద కత. మూడు మాటల్లో చెప్తా ఇను సారూ. మాది రెండెకరాల మాగాణి. చుట్టూ రెడ్డోరి బూములు. బూమిని ప్లాట్లు జేసి అమ్మి, బెంగళూరులో పెద్ద బిల్డింగ్ కట్టాలని అనుకున్నాడు. మా బూమి కదా మజ్జలో ఉండాది. అడిగినాడు మమ్మల. ఎంత రేటయినా ఇస్తానన్నాడు. మేము ఇచ్చేదిలేదని తెగేసి జెప్పినాము.” చెప్పుకొని పోతావుండాది.

“ఎక్కడకా ఆ బూమి?” అడిగినాను మజ్జలో దూరి.

“ఊరు శివర టెంకాయ తోపులుండాయే. ఆ తోపులు రెడ్డోరివే గదా. మజ్జలో టమాటా నాటిండాదే, అది మాది.”

“ఆ ఆ.. దెయ్యాల బాయికి ఉత్తరంగా ఉండాది, అదే గదా. ఆ టామాటా నాటిన రెండెకరాల బూమి గవర్నమెంట్ బూమి అని జెప్పినాడే ఈమజ్జ ఎమ్మార్వో. ఎవురో ఆక్రమించుకున్నారని, స్వాధీనం చేసుకుంటామని గూడా అన్నాడు..”

“నిజిమే, అది గవుర్మెట్టు బూమే. కానీ మాతాతముత్తాతల కాలం కాడినుంచీ మేమే దున్నుకుంటా ఉండాము. ఆమాటకొస్తే చుట్టూ ఉన్న రెడ్డోరి బూముల్లో సగం బూములు గవుర్మెట్టు బూములే. ఆయన తన సర్వే నెంబర్లో కలిపేసుకుని రిజిస్టర్ చేసుకొనేసినాడు. నా బూమిని మాత్రం గవుర్మెట్టు బూమిగా జెప్పి, ఆ ఎమ్మార్వో, రిజిస్ట్రార్ కలిసి ఫైల్ రెడీ చేసి పైకి పంపేసినారు. ఆ మనేదతో నా మొగుడు మంచం పట్టి పైకి చేరినాడు.” ఆయమ్మ గొంతు దుక్కంతో పూడుకు పొయ్యింది.

నేను అవడానికి రిపోర్టర్ అయినా, ఆ టెంకాయ తోపు మజ్జలో ఉండే రెండు ఎకరాల భూమిని గవర్నమెంట్ కాలేజీకి ఇస్తున్నారని ఇంతదాకా తెలియదు. మొన్న ఒకసారి ఎమ్మార్వోను అడిగాను కూడా కొత్తగా శాంక్షన్ అయిన డిగ్రీ కాలేజీకి ప్లేసు చూశారా అని. ఇంకా లేదని చెప్పినాడు.

ఇంకా చానా జెప్పింది ఆయమ్మ. మొత్తం కథ విని టౌన్లోకి బయలుదేరినాను. టెంకాయ తోపు కాడికి వచ్చేసరికి, రియల్ వెంచర్ కోసం ఆ స్థలాన్ని చదును చేస్తున్నారు జేసీబీలతో రెడ్డి మనుషులు. మధ్యలో ఉన్న రెండు ఎకరాల ఆయమ్మ భూమిలో ఉండాది ఒక జేసీబీ. టమాటా తోటను తొవ్వి పోస్తా ఉండాది. మనసంతా భారంగా అయిపొయ్యింది.

కానీ ఆయమ్మ తిరుగుబాటు, ప్లాన్ చేసిన విధానం పక్కాగా ఉండాది. తెగించిన ఆడది ఏమైనా చేయగలదు అన్నదానికి నిలువెత్తు సాక్ష్యంలా అనిపించింది ఆమె.

“వాడి అక్క మీదనే కాదు, మీ ముగ్గురి మీద కూడా కేసు ఫైల్ చేయాల్సిందే. రూల్స్ అలా ఉన్నాయి.” నేను స్టేషన్ కు వెళ్ళేసరికి అంటున్నాడు సీఐ.

స్టేషన్లో ఆయన ఎదురుగా కూర్చుని ఉన్నారు సబ్ రిజిస్ట్రార్, ఎమ్మార్వోలు. వారి శరీరాలు బాగా వంగిపోయి ఉన్నాయి.

ఎప్పుడూ తమతమ ఆఫీసుల్లో పొగరుగా కూర్చుని, పనులకోసం వచ్చే పేదలను బానిసలకంటే హీనంగా చూసే ఆ ఇద్దరు అధికారులనూ అలా చూసేసరికి నాకు ఆయమ్మ చేసిన పని మరోమారు గుర్తుకొచ్చి ముచ్చటగా అనిపించింది.

“ఆ లండీ కొడుకు, అది ఇద్దరూ కలసి చేసిన పని ఇది.” సీఐ కూడా అక్కసుగానే ఉండాడు.

మౌనంగా కూర్చున్నాను దూరంగా ఉన్న సీట్లో నేను.

“అది గ్రామ కంఠం. ఊరంతటకీ చెందిన భూమి అది. రూల్స్ కు విరుద్ధంగా ఆ భూమికి పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చింది మీ వీఆర్వో. దాన్ని అప్రూవ్ చేసి సంతకం చేసింది నువ్వు.” ఎమ్మార్వోను చూస్తా అన్నాడు సీఐ మళ్ళీ.

“నేను ఇలా జరగతాది అనుకోలేదు సార్.” నసిగాడు ఆయన.

“అవును, ఇదిగో నువ్వు ఇచ్చిన పొజిషన్ సర్టిఫికెట్ పెట్టుకుని అడ్డగోలుగా గ్రామకంఠం భూమిని రిజిస్టర్ చేసేసిన ఈ సబ్ రిజిస్ట్రార్ కూడా ఇలా జరగతాదని అనుకోలేదు.” సీఐ విసుగ్గా అన్నాడు.

“ఎగ్జాక్ట్లీ సార్. మాకు రెవెన్యూ రెవెన్యూ ముఖ్యం. గవర్నమెంట్ కు రిజిస్ట్రేషన్స్ ఎన్ని జరిగితే అంత ఆదాయం. మరీ లిటిగేషన్ అనుకుంటే దప్ప సాధారణంగా ఆన్లైన్లోకి వెళ్ళి చెక్ చేయం. అందుకే ఆ రెండు గదుల ఇల్లు, బూమి మొత్తం ఆయమ్మదేనని, వేరేవాళ్ళకి రిజిస్టర్ చేసేసినాము. మీరే ఎలాగైనా మమ్మలని కాపాడాలి. మమ్మల్ని మోసంజేసిన దానిపైన కేసు బుక్ చేయాలి.” సబ్ రిజిస్ట్రార్ వంతు అయింది ఈసారి అడుక్కోవడం.

“లాభం లేదు. ఆ అక్కాతమ్ముళ్లు కలిసి మిమ్మల్ని ఈ కేసులో కావాలనే ఇరికించేశారు. మద్యలో నా చావుకొచ్చింది. మీ ఇద్దరితోపాటు ఆ వీఆర్వో మీద కూడా కేసు ఫైల్ చేయాల్సిందే.” తల పట్టుకున్నాడు సీఐ.

అప్పుడే కానిస్టేబుల్ తెచ్చిన టీ తాగి, పైకి లేచాను.

“ఏంది విశేషాలు? అప్పుడే వెళ్లిపోతున్నావు?” సీఐ పలకరించాడు.

“ఏమీలేదు సార్. ఈ దారిలో వెళ్తా ఒకసారి మీ దర్శనం చేసుకుని వెళ్దామని వచ్చానంతే. మీరు బిజీగా ఉన్నట్లున్నారు, కానివ్వండి.” చెప్పి బయటకు వచ్చేశాను.

“అవును సారూ. నేను, మా తమ్ముడు కలిసే కట్టుకున్నాము ఈ రొండు గదుల రేకుల ఇల్లు. ఓడిప్పుడు బెంగులూరులో యాపారం చేసుకుంటా ఉండాడు. నేను నా పేరుతో పొజిషన్ సర్టిఫికేట్ తీసుకొని, అది పెట్టి ఇంటిని అమ్మేసినాను. రిజిస్ట్రేషను గూడా జరిగిపొయ్యింది. వీఆర్వోకు ఐదు వేలు, ఎమ్మార్వోకు పది వేలు లంచం యిచ్చినాను. సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఇంగో అయిదువేలు యిచ్చినాను. అంతా అడ్డంగానే జరిగింది. నా మీద కేసు పెట్టి, గొడవ చేయమని

నా తమ్ముడికి చెప్పింది నేనే. ఇప్పుడు నిజంగా కేసులో ఇరుక్కునింది ఎవురో మీకు తెలిసే ఉండాల.” ఆయమ్మ మాటలు చెవుల్లో వినిపిస్తా వుండాయి.

అంతేగాదు ఆయమ్మ ఇంకో మాటనింది. రెడ్డి టెంకాయ తోపులో గూడా గవర్నమెంట్ భూమి ఎంత కలిసి ఉందో సర్వే చేసి తేల్చాలని రేపు సోమారం నాడు గ్రీవెన్స్ డేలో కలెక్టర్ కు ఫిర్యాదు చేస్తుందట.

ఆ తెగించిన ఆడది ఊంచిన పువ్వాకు ఎంగిలి ఎవరి మొగాల మీద పడతా ఉండాదో నాకేగాదు, మీకు గూడా తెలిసిపొయ్యి ఉండాల ఈపాటికి.

★★★

COMMENTS